# సాక్షి రంగారెడ్డి

బుధవారం ¦ 30 ¦ ఆగస్టు ¦ 2023






## పునరాలోచించాలి

కల్వకుర్తి టికెట్ కేటాయింపుపై అధిష్టానం పునరాలోచించాలని జెడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్ అన్నారు. 8లో ▸



## వేధిస్తే కఠిన చర్యలు

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర హెచ్చరించారు. 8లో ▸



## వాహనాలపై కొరడా

రోడ్లపై అక్రమ పార్కింగ్‌తో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వారిపై ఇబ్రహీంపట్నం పోలీసులు కొరడా ఝులిపించారు. 8లో ▸

## న్యూస్‌రీల్

### డిగ్రీలో ప్రవేశాలకు స్పెషల్ డ్రైవ్

**షాద్‌నగర్:** డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు షాద్‌నగర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కమలమ్మ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. డిగ్రీ ప్రవేశాల కోసం దోస్త్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 4వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్, అప్లికేషన్స్‌లో 74, బీఎస్సీలో 25, బీజెడ్సీ, బీజెడ్ఎస్‌లో 63, బీఎస్సీ ఎంపీసీ, ఎంపీసీఎస్‌లో 53, బీఏ ఇంగ్లిష్ మీడియంలో 5, బీఏ (హెచ్‌ఈపీ) తెలుగు మీడియంలో 5, బీఏ (హెచ్‌ఈపీ) ఇంగ్లిష్ మీడియంలో 34సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 98667 42205 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

### బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడిగా శ్రీధర్‌రెడ్డి



**యాచారం:** బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడిగా యాచారం గ్రామ సర్పంచ్ ముదిరెడ్డి శ్రీధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర కమిటీలో తీసుకోబోయో కీలక విషయాలన్నీ కౌన్సిల్ సభ్యులతో చర్చిస్తారు. నియోజకవర్గానికి ఒకరి చొప్పున కౌన్సిల్ సభ్యులు ఉంటారు. అలాంటి కీలకమైన పోస్టు శ్రీధర్‌రెడ్డికి దక్కింది. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకరావడమే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు.

### ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించండి: సీఐటీయూ



ఆశ కార్యకర్తలతో మాట్లాడుతున్న రవికుమార్

**మీర్‌పేట:** ఆశ వర్కర్లకు రూ.18వేల కనీస వేతనం చెల్లించడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఆశ వర్కర్లతో కలిసి సీఐటీయూ నాయకులు మీర్‌పేటలోని మంత్రి సబితారెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ.. 2021 జూలై నుంచి డిసెంబరు వరకు 6 నెలల పీఆర్సీ ఏరియర్స్‌ను ఆశాలకు వెంటనే చెల్లించాలని, అదేవిధంగా ప్రసూతి సెలవులపై కూడా వెంటనే సర్క్యులర్‌ను జారీ చేయాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యంతో పాటు ఉద్యోగ భద్రత, హెల్త్‌కార్డులు, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం మంత్రి సబితారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు శేఖర్, బాలరాజు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

### 1నుంచి జోనల్ స్థాయి కబడ్డీ పోటీలు

**మొయినాబాద్‌రూరల్:** 67వ రాజేంద్రనగర్ జోనల్ స్థాయి స్కూల్ గేమ్స్ (కబడ్డీ పోటీలు)ను శంషాబాద్‌లోని బాలయేసు ఇంటర్నేషనల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు జోనల్ కార్యదర్శి బాలస్వామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1, 2వ తేదీల్లో రెండురోజుల పాటు నిర్వహించే ఈ కబడ్డీ పోటీలు రెండు విభాగాలుగా నిర్వహిస్తామన్నారు. 1వ తేదీన అండర్-14 బాలబాలికలు, 2న అండర్-17 బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడల్లో పాల్గొనాలనుకునేవారు పాఠశాల నుంచి బోనోఫైడ్, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. వివరాలకు 98667 06457 బాలస్వామిరెడ్డి, 77022 27888 సుధాకర్‌ను సంప్రదించాలని కోరారు.

### 'చలో మైదాన్'తో యువతకు ప్రోత్సాహం

డీఎస్‌డీఓ వెంకటేశ్వర్‌రావు

**హుడాకాంప్లెక్స్:** ప్రపంచ అత్యుత్తమ హాకీ క్రీడాకారుల్లో ఒకరైన మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జిల్లా యువజన క్రీడల అధికారి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్రీడలతో మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం కలుగుతుందని డీఎస్‌డీఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. 'చలో మైదాన్' పేరిట యువతను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. యువత ప్రతి రోజు క్రీడలకు తగిన సమయం కేటాయించాలన్నారు. క్రీడల్లో రాణించినవారికి ప్రభుత్వ ఉద్యోగాలు కూడా వస్తాయన్నారు. స్టాఫ్ కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, జిల్లా అసోసియేషన్ క్రీడాకారులు లక్ష్మీ, డైరెక్టర్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి పాల్గొన్నారు.

# సిట్టింగ్‌లకు ఫిట్టింగ్!



తలకొండపల్లిలో జైపాల్‌యాదవ్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన సమావేశానికి హాజరైన నేతలు

**బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై అసంతృప్త జ్వాలలు**

- టికెట్ల ప్రకటనపై అసమ్మతి నేతల తిరుగుబావుటా
- కల్వకుర్తిలో జైపాల్‌యాదవ్‌కు వ్యతిరేకంగా సమావేశాలు
- 'పట్నం'లో మంచిరెడ్డికి.. క్యామ ఝలక్

**సాక్షి, రంగారెడ్డి జిల్లా:** బీఆర్‌ఎస్ సిట్టింగ్ శాసనసభ్యులపై అసమ్మతి రాజుకుంటోంది. అధిష్టానం ఆదేశాలను సైతం లెక్కచేయకుండా.. కొంతమంది ఆశావహులు ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారు. పార్టీ క్యాడర్ అభిప్రాయానికి కనీస గౌరవం ఇవ్వకుండా.. ప్రజాదరణ లేని వ్యక్తులకు మళ్లీ టికెట్లు ఎలా ప్రకటిస్తారని నిలదీస్తున్నారు. ఇప్పటికే కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అభ్యర్థిత్వాన్ని నిరసిస్తూ.. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి వర్గీయులు నియోజకవర్గంలో అసమ్మతి సమావేశాలు నిర్వహిస్తున్నారు. తాజాగా ప్రచారానికి ఆహ్వానించేందుకు క్యామ మల్లేశ్ ఇంటికి వెళ్లిన ఇబ్రహీంపట్నం సిట్టింగ్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి ఊహించని షాక్ ఎదురైంది.

**తప్పిస్తారా.. తప్పుకోమంటారా..?**

కల్వకుర్తి సిట్టింగ్ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు వ్యతిరేకంగా ఆదివారం కడ్తాల్ కేంద్రంలో సమావేశమైన కసిరెడ్డి వర్గీయులు.. తాజాగా మంగళవారం తలకొండపల్లి వేదికగా మరోసారి మీటింగ్ పెట్టి వ్యతిరేక గళం వినిపించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా జైపాల్‌ను తప్పించాలని వీరంతా పట్టుబడుతున్నారు. తమ అభిప్రాయాన్ని కాదని ఆయనకే టికెట్ ఇస్తే తమ దారి తాము చూసు కుంటామంటూ అధిష్టానానికి అల్టిమేటం జారీ చేశారు. ఇదిలా ఉండగా అసమ్మతి గ్రూపులో ఇప్పటి వరకు కీలకంగా వ్యవహరించిన తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌గుప్తా ఇటీవల ఆయన అనుచరులతో కలిసి మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఇందుకు ప్రతిఫలంగా ఆయనకు త్వరలోనే ఏదో ఒక కార్పొరేషన్ పదవి కట్టబెట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. జెడ్పీటీసీ చేరికతో అసమ్మతి కొంత సద్దుమణిగిందని పార్టీ పెద్దలు భావిస్తున్న సమయంలో మళ్లీ అసంతృప్తి జ్వాలలు ఎగిసి పడుతున్నాయి.

**మంచిరెడ్డికి 'షాక్'**

గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరిన క్యామ మల్లేశ్ అధిష్టానంపై గత కొంతకాలంగా గుర్రుగా ఉన్నారు. పార్టీలో చేరిన తర్వాత తనకు తగిన గుర్తింపు ఇవ్వలేదనే అసంతృప్తితో ఉన్నారు. తాజాగా ఇబ్రహీంపట్నం సిట్టింగ్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తన అనుచరులతో కలిసి మంగళవారం ఉదయం క్యామ ఇంటికి చేరుకున్నారు. ఎన్నికల్లో ప్రచార బాధ్యతలు స్వీకరించాలని అభ్యర్థించేందుకు వెళ్లారు. గతకొంత కాలంగా ఎమ్మెల్యేతో అంటీముట్టనట్టుగా ఉంటున్న క్యామ.. ఎమ్మెల్యే మంచిరెడ్డి ఫోన్ చేసినా ఎత్తలేదు. దీంతో ఆయనే స్వయంగా ఇంటికి వెళ్లారు. శేరిగూడ ప్రచార బాధ్యతలు చూసుకోవాలని క్యామను కోరినట్లు తెలిసింది. అప్పటికే తీవ్ర అసంతృప్తితో ఉన్న క్యామ.. ఈ ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం. కాంగ్రెస్‌ను వీడి.. బీఆర్‌ఎస్‌లో చేరిన తర్వాత ఇప్పటి వరకు తనను పట్టించుకోకుండా.. సమయానికి వచ్చి ప్రచారానికి రమ్మనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించినట్లు తెలిసింది. జిల్లాలో ముగ్గురు మంత్రులు, ముగ్గురు జెడ్పీటీసీలు, డీసీసీబీ చైర్మన్లు, గ్రంథాలయ చైర్మన్లు.. అన్ని పదవులను ఒకే వర్గానికి కేటాయించి.. బీసీలను చిన్న చూపు చూశారని, ఇకపై తాను ప్రచారానికి వచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పినట్లు విశ్వసనీయ సమాచారం.



బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి తదితరులు

# మరోసారి ఆశీర్వదించండి

- బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి
- జిల్లాలో రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి రూ.124 కోట్లు మంజూరు
- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి
- కొమరబండ-రేగడిదోస్వాడ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన

**షాబాద్:** మరోసారి బీఆర్‌ఎస్ పార్టీని ఆశీర్వదిస్తే రాష్ట్రంలో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. షాబాద్ మండల పరిధిలోని కొమరబండ-రేగడిదోస్వాడ గ్రామాలను కలిపే హైవే బ్రిడ్జి నిర్మాణ పనులకు మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే యాదయ్యతో కలిసి ఆయన శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జిల్లాలో రోడ్లు, బ్రిడ్జి నిర్మాణాల కోసం ఇప్పటివరకు రూ.124 కోట్ల నిధులు అందించామన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో రూ.52 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఐటీ మినిస్టర్ కేటీఆర్‌తో మాట్లాడి షాబాద్‌లో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడూతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు మానుకోవాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మీ, సర్పంచ్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, మాజీ చైర్మన్లు వెంకటయ్య, శ్రీనివాస్‌గౌడ్, మతీన్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సీనియర్ నాయకులు మహేందర్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్ తదితరులున్నారు.

# నీటి సమస్య రానివ్వం



సరూర్‌నగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి

- మంత్రి సబితారెడ్డి

**హుడాకాంప్లెక్స్:** రాబోయే 50 ఏళ్ల వరకు హైదరాబాద్ నగరానికి మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి సబితారెడ్డి అన్నారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో రూ.2కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మంగళవారం ఎమ్మెల్సీ దయానంద్ గుప్తాతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. టెండర్లు పూర్తయినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఎస్‌బీఐ కాలనీలోని పార్కు, భగత్‌సింగ్‌నగర్‌లోని మహిళా భవనం పనులు కొద్దిగా ఆలస్యమయ్యాయని అన్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తామని తెలిపారు. రూ.6 కోట్ల వ్యయంతో విజయపురి కాలనీలో ఎస్ఎన్‌డీపీ పనులను ప్రారంభించడం జరిగిందని, ఆ పనులు పూర్తయితే ముంపు సమస్య ఉండదన్నారు. త్వరలోనే పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండల్‌రెడ్డి, మహేందర్ యాదవ్, బాలకిషన్, అరవింద్ శర్మ, మల్లేశ్, రాంనర్సింహగౌడ్ పాల్గొన్నారు.

# గ్రామీణ క్రీడలకు ప్రాధాన్యత

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

**ఇబ్రహీంపట్నం:** గ్రామీణ క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. డివిజన్ స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించే పాఠశాల క్రీడోత్సవాలను మంగళవారం స్థానిక గురుకుల విద్యాపీఠ్ పాఠశాల ఆవరణలో ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. నియోజకవర్గ కేంద్రంలో మీని స్టేడియంతోపాటు మండలాలు, మున్సిపాలిటీలవారీగా క్రీడా ప్రాంగణాలను నెలకొల్పనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి శ్రవంతి, గురుకుల విద్యాపీఠ్ ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రావు, ఎస్‌జీఎఫ్ జోనల్ కార్యదర్శి దేవదాసు, పీఈటీలు పాల్గొన్నారు. ఎంకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి 1200 స్పోర్ట్స్ డ్రెస్‌లను పంపగా వాటిని ఎమ్మెల్యే మంచిరెడ్డి క్రీడాకారులకు అందజేశారు.

**అవకాశాలను అందిపుచ్చుకోవాలి..**

**మంచాల:** అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మంచాల మండల పరిధిలోని చిత్తాపూర్‌లో ఎస్సీ కార్పొరేషన్, సావిత్రిబాయి పూలే సంస్థ సహకారంతో మహిళలకు టైలరింగ్‌లో ఇచ్చిన ఉచిత శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే.. ఆయా సంస్థలు అందజేసిన కుట్టు మెషీన్లు, సర్టిఫికెట్లను మహిళలకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదరిక నిర్మూళనకు కృషి చేస్తుందన్నారు. చిత్తాపూర్, తాళ్లపల్లి గూడ, తిప్పాయిగూడ, సీతారాంపేట్ గ్రామాల్లో 140 మంది మహిళలకు 30 రోజుల ఉచిత శిక్షణ అనంతరం కుట్టు మెషీన్లు అందించారన్నారు. అనంతరం మంచాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ నిత్యారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, సర్పంచ్ నాగరాజ్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యురాలు సుకన్య, ఎంపీడీఓ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

# బీఆర్‌ఎస్‌తోనే తండాల అభివృద్ధి

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**ఆమనగల్లు:** కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో నూతనంగా రూ.65 కోట్లతో బీటీ రోడ్లు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వెల్లడించారు. మండలంలోని పోలెపల్లి, సింగంపల్లి, మాలెపల్లి, కొత్తకుంటతండాలో పలు అభివృద్ధి పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జంగారెడ్డిపల్లి నుంచి చంద్రాయణపల్లి వరకు రూ.2.12 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు ఆధునీకరణ, పోలెపల్లి గేటు నుంచి ఆకుతోటపల్లి వరకు రూ.3 కోట్లతో నిర్మించే బీటీరోడ్డు, పోలెపల్లి గేటు నుంచి మంగళికుంటతండాకు రూ.60 లక్షలతో నిర్మించే బీటీరోడ్డు ఆధునీకరణ, పోలెపల్లి నుంచి కొత్తకుంట తండా వరకు రూ.1.50 కోట్లతో నిర్మించే బీటీరోడ్డు, మాలెపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అనురాధ, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, వైస్ చైర్మన్ సత్యం, రైతు సమన్వయ సమితి కన్వీనర్ నారాయణ, ఎంపీటీసీ సభ్యులు కుమార్, సర్పంచ్‌లు బల్‌రాం, ప్రేమలత, శోభ, శ్రీనయ్య, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్, నాయకులు పాల్గొన్నారు.



బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**ఆమనగల్లు పట్టణంలో..**

ఆమనగల్లు పట్టణంలో రూ.10 లక్షలతో నిర్మించే గౌడసంఘం భవనం, రూ.10 లక్షలతో నిర్మించే యాదవ సంఘం భవనం, రూ.5 లక్షలతో నిర్మించే పూసల కమ్యూనిటీ భవనం, రైతువేదిక వద్ద రూ.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, తలకొండపల్లి ఎంపీపీ నిర్మల, చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## 'సేవ'కు సత్కారం



ఆంజనేయులును సన్మానిస్తున్న అతిథులు

**కందుకూరు:** కందుకూరుకు చెందిన తెలంగాణ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆంజనేయులు మదర్ థెరిసా అవార్డును అందుకున్నారు. మదర్ థెరిసా జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. శాసన మండలి డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాష్‌ముదిరాజ్, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ చేతుల మీదుగా వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిని ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేశారు. అందులో భాగంగా ఆంజనేయులుకు వారు అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ, కోఆర్డినేటర్ శివకుమార్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# విధేయతకు పట్టం కట్టారు

- ఫుడ్ కమిషన్ చైర్మన్ 'గోలి' ఇంటి వద్ద అభిమానుల సంబురాలు

**ఆమనగల్లు:** పదవి ఉన్నా లేకున్నా బీఆర్‌ఎస్ పార్టీ పటిష్టతకు, విజయానికి కృషిచేసిన ఆ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డికి రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ పదవి వరించిన విషయం తెలిసిందే. ఈ పదవిలో ఆయన ఐదేళ్లపాటు కొనసాగనున్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన గోలి శ్రీనివాస్‌రెడ్డి 30 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న గోలి శ్రీనివాస్‌రెడ్డి 2012లో బీఆర్‌ఎస్‌లో చేరారు. అప్పటినుంచి బీఆర్‌ఎస్ పటిష్టతకు పనిచేస్తూ వచ్చారు. గోలి శ్రీనివాస్‌రెడ్డికి వివాద రహితుడు, పార్టీకి విధేయుడని పేరు ఉంది. 2014, 2018 ఎన్నికల సమయంలో కల్వకుర్తి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించినప్పటికీ టికెట్ దక్కలేదు. అయినప్పటికీ అధిష్టానం సూచన మేరకు పార్టీ విజయం కోసం పనిచేశారు. గోలి శ్రీనివాస్‌రెడ్డికి భవిష్యత్‌లో తగిన గౌరవం ఇస్తామని సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావ్ గతంలో అనేక మార్లు చెప్పారు. ఎట్టకేలకు గోలి శ్రీనివాస్‌రెడ్డికి ఫుడ్ కమిషన్ చైర్మన్ పదవి దక్కింది. విధేయతకు పట్టంకట్టారు అంటూ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గోలి శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

**గోలికి పలువురి శుభాకాంక్షలు..**

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా ఎన్నికైన గోలి శ్రీనివాస్‌రెడ్డికి మంగళవారం ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, సుధీర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో గోలి శ్రీనివాస్‌రెడ్డి నివాసం వద్ద మంగళవారం అభిమానులు సంబురాలు జరుపుకున్నారు. కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాడ్గుల మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు ఖలీల్, ప్రసాద్, శివకుమార్, సుభాష్ తదితరులు ఆయనను సన్మానించారు.

# గిరిజనులకు అండగా ఉంటాం

- మాజీ ఎంపీ వీహెచ్
- బాధితురాలు లక్ష్మికి కాంగ్రెస్ పార్టీ తరఫున రూ.4లక్షల ఆర్థికసాయం

**బడంగ్‌పేట్:** ఎల్‌బీనగర్ పోలీసుల చేతిలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న గిరిజన మహిళ లక్ష్మికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచింది. లక్ష్మిని ఆర్థికంగా ఆదుకుంటామని ఆ పార్టీ గతంలో ప్రకటించగా... అట్టి సహాయాన్ని బాధితురాలికి మంగళవారం మాజీ ఎంపీ వీ.హన్మంతవరావు అందజేశారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అండగా ఉంటుందని స్పష్టంచేశారు. హనుమంతరావు రూ.లక్ష, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి రూ.50 వేలు, మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి రూ.లక్ష, కొత్త మనోహర్‌రెడ్డి రూ.50 వేలు, జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి రూ.50 వేలు, కందుకూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్ రూ.50 వేలను మొత్తంగా రూ.4లక్షల నగదును లక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, బడంగ్‌పేట్ మేయర్ పారిజాత, మీర్‌పేట్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు మల్లారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మికి నగదు అందజేస్తున్న హనుమంతరావు, నాయకులు

# నేటి నుంచి నేషనల్ లోక్ అదాలత్

చేవెళ్ల: ట్రాఫిక్ కేసులకు సంబంధించిన పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చేవెళ్ల ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ సైదులు మంగళవారం తెలిపారు. ఈనెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు చేవెళ్ల కోర్టు ఆవరణలో ఈ లోక్ అదాలత్ ఉంటుందని చెప్పారు. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ మండలాల పరిధిలో నమోదైన డ్రైవింగ్‌లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారు, ఇతర కారణాలతో వాహనాలపై కేసులు నమోదు అయిన వారు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని సూచించారు. చేవెళ్ల కోర్టులో నిర్వహించే ఈ లోక్ అదాలత్‌కు వచ్చే వారు ఒరిజనల్ డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డులను తీసుకొని రావాలని, వారివారి కేసులను బట్టి జరిమానాలు 2వేల నుంచి 5వేల వరకు ఉంటాయని చెప్పారు.



# అధిష్టానం పునరాలోచించాలి

- జైపాల్‌యాదవ్‌ను బలపర్చే ప్రసక్తే లేదు
- తేల్చి చెప్పిన ఎమ్మెల్సీ కసిరెడ్డి మద్దతుదారులు



తలకొండపల్లిలో సమావేశమైన కసిరెడ్డి మద్దతుదారులు

తలకొండపల్లి: బీఆర్ఎస్ కల్వకుర్తి టికెట్ కేటాయింపుపై అధిష్టానం పునరాలోచించాలని నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్ అన్నారు. మండల కేంద్రం సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు వ్యతిరేకంగా సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ అసమ్మతి నేతలు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి మద్దతుదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. జైపాల్ యాదవ్‌కు టికెట్ ఇస్తే బీఆర్ఎస్ ఓటమి ఖాయమన్నారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ్‌రెడ్డికి అవకాశం ఇస్తేనే ఈ ప్రాంతం అన్నిరంగాల్లో ముందుకు వెళ్తుందని తెలిపారు. బాలాజీసింగ్ మాట్లాడుతూ.. ప్రజాదరణ కలిగిన కసిరెడ్డికి టికెట్ ఇవ్వాలని కోరారు. జేఏసీ అధ్యక్షుడు రఘురాములు మాట్లాడుతూ.. 2018లోనే నారాయణ్‌రెడ్డికి టికెట్ వస్తుందని భావించామన్నారు. రాంపూర్ కృష్ణ, జంగారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ జంగయ్య, చౌదర్‌పల్లి ప్రదీప్‌రెడ్డి, కర్కాస్‌తండా శంకర్‌నాయక్, చంద్రధన రాఘవేందర్, మెదక్‌పల్లి నరేష్‌గౌడ్ గట్టుఇప్పలపల్లి మహేశ్ మాట్లాడుతూ.. జైపాల్‌యాదవ్‌ను బలపర్చే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు జోగు రమేష్, రాంపూర్ కృష్ణ, జేఏసీ నాయకులు రేణురెడ్డి, సర్పంచ్‌లు వెంకట్రాంరెడ్డి, రమేష్‌యాదవ్, శ్యాంసుందర్‌రెడ్డి, ఉప సర్పంచ్‌లు అజీజ్, శ్రీనివాసురెడ్డి, ఎంపీటీసీ అంబాజీ, రఘునాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, రాష్ట్ర గిరిజన నాయకులు హన్మనాయక్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

కొత్తూరు: విద్యుదాఘాతంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలైయ్యాయి. ఈ ఘటన కొత్తూరు పట్టణంలోని నారాయణగూడ కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలం, గురుకుంట గ్రామానికి చెందిన పవన్‌కుమార్(23) ప్లంబింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పనుల్లో భాగంగా మంగళవారం నారాయణగూడ కాలనీలోని ఓ ఇంటి పైఅంతస్థులో వాటర్‌ట్యాంక్‌ను బిగించే క్రమంలో అతని చేతిలోని పైపు పై నుంచి వెళ్లిన 33కేవీ విద్యుత్ తీగలకు తాకింది. దీంతో కరెంట్ షాక్‌కు తగిలి తీవ్రగాయాలైయ్యాయి. వెంటనే బాధితుడిని ఉస్మానియాకు తరలించారు.



తీవ్రంగా గాయపడిన పవన్‌కుమార్

## రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలపై కొరడా

నంబర్ ప్లేట్స్‌లేని 5 వాహనాలు సీజ్, పలు వాహనాలకు చలాన్‌లు



అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన వాహనాల తనిఖీల్లో పోలీసులు

ఇబ్రహీంపట్నం: ప్రతినిత్యం రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలను పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వారిపై మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీసులు కొరడా ఝళిపించారు. ప్రతినిత్యం స్థానిక మార్కెట్ యార్డు నుంచి అంబేడ్కర్ చౌరస్తా, మంచాల రోడ్డులో వందల వాహనాలను రోడ్లపై ఇష్టానుసారం పార్క్ చేసి వెళ్తుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేక డ్రైవ్ భాగంగా ఒక్కసారిగా ఎస్ఐలు, పోలీసు సిబ్బంది రోడ్లపైకి వచ్చారు. రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాల ఫొటోలు తీసి, చలాన్లను విధించారు. నంబర్ ప్లేట్స్‌లేని 5 వాహనాలను సీజ్ చేశారు. రోడ్లపై వాహనాలు నిలిపితే కేసులు నమోదు చేస్తామని, ప్రతినిత్యం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని పోలీసులు హెచ్చరించారు.

## బాలబాలికల రక్షణకు ప్రత్యేక చర్యలు

రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ సాధన రేష్మి పెరుమాళ్

చేవెళ్ల: బాలబాలికల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అమ్మాయిలను వేధిస్తే కఠిన శిక్షలు తప్పవని రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ సాధన రేష్మి పెరుమాళ్ హెచ్చరించారు. చేవెళ్లలోని శ్రీసత్యసాయిగ్రామర్ హైస్కూల్‌లో మంగళవారం చిల్డ్రన్ సేఫ్టీ క్లబ్‌పై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీసీపీ మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో చిల్డ్రన్ సేఫ్టీ క్లబ్‌లను ఏర్పాటు చేసి వాటిపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ చిల్డ్రన్స్ సేఫ్టీ క్లబ్‌లను రాజేంద్రనగర్ జోన్‌పరిధిలోని అన్ని పాఠశాలలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి ప్రత్యేకంగా పాఠశాలలో ఒక టీం ఉంటుందని చిల్డ్రన్‌సేఫ్టీ క్లబ్ బాక్స్‌లను పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. నేరుగా చెప్పుకోలేని సమస్యలను విద్యార్థులు ఒక కాగితంపై రాసి ఈ బాక్స్‌లో వేయాలని, ఈబాక్స్‌లు వాష్‌రూంల వద్ద ఉంటాయని చెప్పారు. ప్రతి అమ్మాయికి గుడ్, బ్యాడ్ టచ్‌లకు సంబంధించిన విషయాలను ఉపాధ్యాయులు తెలియజేయాలన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పాఠశాలల బస్సుల డ్రైవర్లకు సంబంధించిన పూర్తి సమాచారం పాఠశాల యాజమాన్యల వద్ద ఉండాలని సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్, పాఠశాల పిన్సిపాల్స్ కవిత, అలేఖ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# మహిళలను వేధిస్తే కఠిన చర్యలు



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ఇందిర

మంచాల: మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర హెచ్చరించారు. మంగళవారం మంచాల మండలంలోని బండలేమూర్ గ్రామంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ మహిళలకు రక్షణగా అనేక చట్టాలు ఉన్నాయన్నారు. 18 సంవత్సరాల లోపు వారికి వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఏవరైనా బాల్య వివాహాలు చేస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉంటే సగం సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది సీహెచ్ రవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, స్థానిక సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ సంతోష, ఎంపీటీసీ సభ్యుడు మదుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బాలికలపై వివక్ష చూపించొద్దు

ఇబ్రహీంపట్నం: బాలికలపై వివక్ష చూపించొద్దని, వారికి సమాన ఆవకాశాలు కల్పించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర అన్నారు. విమెన్ ఈ క్వాలిటీ డే పురస్కరించుకొని మంగళవారం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో లింగ వివక్షత ఇంకా కొనసాగుతుందని, ఇది సహించరానిదన్నారు. భ్రూణ హత్యలకు పాల్పడే వారిపై, వాటిని నిర్ధారించే పరీక్షలు చేసే ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులను కల్పించిందని వాటిని సద్వినియోగం చేసుకొని అన్నిరంగాలల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా జడ్జి ఇందిరను లెక్చరర్లు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు సిహెచ్ రవి, రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ఏబీవీపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

మీర్‌పేట: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు ఎల్‌బీనగర్ విభాగ్ ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం మీర్‌పేట జిల్లెలగూడలోని మంత్రి సబితారెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. బందోస్తు నిర్వహిస్తున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు మహేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన 6,612 డీఎస్సీ పోస్టుల నోటిఫికేషన్‌తో పాటు ఖాళీగా ఉన్న 15 వేల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, గ్రూప్-1 ప్రిలిమ్స్ క్వాలిఫైడ్ లిస్ట్‌ను విడుదల చేసి మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని కోరారు. ముట్టడిలో ఏబీవీపీ నగర కార్యదర్శి శ్రీకాంత్, శ్రీరాం, విభాగ్ కన్వీనర్లు శ్యామ్‌కిరణ్, సూర్యప్రకాశ్, జిల్లా కన్వీనర్లు సాయిరాం, సాయిచరణ్, సిద్దార్థ, నాయకులు దీప్తి, హనుమాన్ చారి, కృష్ణ, మనోహర్ ఉన్నారు.

## 108లో మహిళ ప్రసవం

తల్లిక్షేమం, నిలోఫర్‌కు చిన్నారి తరలింపు



108లో పాపను పరిక్షిస్తున్న ఈఎంటీ

కేశంపేట: పురిటి పనొప్పులతో బాధపడుతున్న గర్భిణిని అంబులెన్స్‌లో షాద్‌నగర్‌కు తరలిస్తుండగా నొప్పులు ఎక్కువై అంబులెన్స్‌లోనే మగ శిశువుకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చౌలపల్లి గ్రామానికి చెందిన స్వామియాదవ్ భార్య హేమలతకు సోమవారం అర్ధరాత్రి 11గంటలకు పురిటి రావడంతో కుటుంబ సభ్యులు 108 ద్వారా కేశంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ గర్భిణి పరిక్షించిన వైద్య సిబ్బంది 7నెలలకే పురిటినొప్పులు వస్తుండటంతో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. షాద్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా పాటిగడ్డ శివారులోకి వెళ్లగానే పురిటి నొప్పులు ఎక్కువై మార్గమధ్యంలోనే ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ప్రసవం చేశాడు. అనంతరం షాద్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ తల్లిశిశువును పరిక్షించిన వైద్యులు చిన్నారి 7నెలలకే పుట్టినందున్న బరువు తక్కువగా ఉందని నిలోఫర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. సకాలంలో స్పందించిన 108 పైలెట్ దీపక్, ఎమర్జెన్సీ టెక్నిషియన్ రాంచందర్‌ను గ్రామస్తులు అభినందించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన మణిక్‌దేవ్ కిస్కు(42) రాయపోల్ సమీపంలోని వైట్‌గోల్డ్ కంపెనీలో లేబర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. పనిముగించుకుని రాయపోల్‌కు వెళ్లే రోడ్డు దా టుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## తప్పుడు ప్రచారంపై కేసు

ఆమనగల్లు: ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌పై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న పట్టణానికి చెందిన రవిరాథోడ్, ఆనంద్, సీతారాంలపై కేసు నమోదు చేసినట్లు ఆమనగల్లు ఎస్ఐ బాల్‌రాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న సోషల్ మీడియాలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌పై తప్పుడు ప్రచారం చేశారని వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. రాజకీయంగా నిరాధారమైన ఆరోపణలు, అసత్య ప్రచారాలను సోషల్ మీడియాలో చేయరాదని సూచించారు. అలాగే, సోషల్ మీడియాలో ఒక వర్గంపై మరోవర్గం కించపరిచే పోస్టులు పెట్టినా, మాట్లాడిన చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

# రూ.95 వేలు, సెల్‌ఫోన్ స్వాధీనం

నిందితులకు రిమాండ్
వివరాలు వెల్లడించిన ఏసీపీ రంగస్వామి



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్ రూరల్: ఇతర రాష్ట్రానికి చెందిన దుప్పట్ల వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురిని మంగళవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ప్రతాప్‌లింగం, ఏసీపీ రంగస్వామి తెలిపిన వివరాల ప్రకారం షాద్‌నగర్ పట్టణంలోని సాయిబాబ కాలనీలో ఉంటున్న మధ్యప్రదేశ్‌కు చెందిన దుప్పట్ల వ్యాపారస్తులు తాము నివాసం ఉంటున్న షెట్టర్‌లో నుంచి ఈ నెల 22వ తేదీన లక్ష రూపాయల నగదు, సెల్‌ఫోన్ చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు 28న షాద్‌నగర్ బస్టాండ్ నుంచి యూపీకి వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు ఇర్షాద్, మఫూజ్, ఫరీద్‌ఖాన్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకొన్నారు. నిందితుల నుంచి రూ.95 వేల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం దొంగలను రిమాండ్‌కు తరలించారు. చోరీ కేసులో కృషి చేసిన పట్టణ సీఐ ప్రతాప్‌లింగం, డీఐ రాంరెడ్డి, ఎస్ఐ నయీముద్దీన్, పీసీలు జాకీర్, రవి, యాదగిరి, మోహన్, రాజు, రఫీలను ఏసీపీ రంగస్వామి అభినందించారు.

# బైక్‌ను ఢీకొట్టిన ట్రాలీ ఆటో.. వ్యక్తి మృతి



కార్తీక్‌రెడ్డి (ఫైల్)

మొయినాబాద్: బుల్లెట్ బైక్‌ను ఎదురుగా అతివేగంగా వచ్చిన అశోక్ లేలాండ్ ట్రాలీ ఆటో ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారిపై మండలంలోని చిన్నషాపూర్ గేటు సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్‌లోని బండ్లగూడ జాగీర్‌కు చెందిన గడ్డం కార్తీక్‌రెడ్డి(30) సోమవారం వికారాబాద్ జిల్లాలోని పూడూర్‌లో ఉంటున్న తన అమ్మను చూడటానికి బుల్లెట్ బైక్‌పై వెళ్లాడు. రాత్రి అక్కడే ఉండి మంగళవారం ఉదయం తిరిగి బండ్లగూడ జాగీర్‌కు బైక్‌పై బయలుదేరాడు. ఉ.10 గంటల సమయంలో హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారిపై మండల పరిధిలోని చిన్నషాపూర్ గేటు సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు రాగానే నగరం నుంచి చేవెళ్ల వైపు అతివేగంతో వెళ్తున్న అశోక్ లేలాండ్ ట్రాలీ ఆటో ఎదురుగా వస్తున్న బుల్లెట్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో కార్తీక్‌రెడ్డి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.